ఈనాడు
హైదరాబాద్



తల్లిదండ్రులు, భార్యా పిల్లలతో డా॥రఘురామ్

# అమ్మ ప్రేమే...
# స్వదేశానికి రప్పించింది!!

**క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ పి.రఘురామ్**

అమ్మంటే... ఆ బిడ్డకు ప్రాణం. అమృతాన్ని మించిన ప్రేమాప్యాయతలతో పెంచి పెద్దచేసిన ఆమె కళ్లెదుటే కని పించే దైవం. అడగకనే వరాలిచ్చే వరదాయిని. తనకే కాదు ఈ భూమిపై జన్మించిన ప్రతి ఒక్కరికీ అమ్మ అపురూపమే. అలాంటి తల్లులను రాసిరంపాన పెట్టే మహమ్మారి బ్రెస్ట్ క్యాన్సర్. కన్నబిడ్డల పెంపకంలో, కుటుంబ సభ్యుల ఆలనాపాలనలో తమను తామే మరచిపోయే ఆ త్యాగమూర్తులు... తమ శరీర భాగాల్లో పెరుగుతున్న రాకాసిని కనిపెట్టలేకపోతున్నారు. తీరా తెలుసుకునే సరికి పరిస్థితి చేజారిపోతుంది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన ఆ బిడ్డడు తన తల్లిలాగా మరెవరూ దీని బారిన పడకూడని... ఈ దేశంలోని ప్రతి తల్లీ కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని... అందుకు తనంతట తానుగా అంకితం కావాలని నిశ్చయించుకున్నాడు. ఆ మరుక్షణమే... విదేశాల్లో స్థిరపడాలన్న తన ఆకాంక్షను మార్చుకున్నాడు. గడించిన పేరు ప్రఖ్యాతులను పక్కన పెట్టేశాడు. తన లాగే వైద్యురాలైన భార్య, చిన్నారులైన ఇద్దరు పిల్లలతో సహా మాతృభూమికి విచ్చేశాడు. అతనే క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డా॥పి.రఘురామ్.

## ఆదర్శం...



ఇంటినిండా వైద్యులు. అదీ విదేశంలో. తల్లి, తండ్రి, భార్య కూడా డాక్టర్లే. హాయిగా సాగిపోతున్న జీవితంలో ఓ షాక్... తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్. ఆమె తోపాటు ఇలాంటి వ్యాధితో బాధ పడే మహిళలకు అవగాహన కల్పిం చాలన్న లక్ష్యంతో స్వదేశానికి వచ్చే శాడు... వివరాలు మధ్యపేజీలో

ఈనాడు
హైదరాబాద్



## అమ్మ కోసమే...

ఉన్నత విద్యావకాశాల పరంగా పదకొండేళ్ల క్రితం బ్రిటన్ వెళ్లిన నేను అక్కడే స్థిరపడాలనుకున్నాను. ఆరేళ్ల క్రితం మా అమ్మ ఉషా లక్ష్మికి రొమ్ముకేన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. అక్కడున్న బిజీ షెడ్యూల్ కారణంగా ఇక్కడ ఉండేందుకు వీలుకాదు. కొంత కాలం చికిత్స చేయించాము. అనంతరం రొమ్ము కేన్సర్‌కు వైద్యం అందించే ఆసుపత్రులున్నాయా? అని విచారిస్తే సరైన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు లేరని తెలిసింది. రొమ్ము కేన్సర్ నియంత్రణపై ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్న నేను వెంటనే ఇక్కడికి రావాలని బలంగా నిర్ణయించుకున్నాను. ఇది కేవలం మా అమ్మకు ఇలా అయ్యిందని కాదు... మా అమ్మలాంటి వారి కోసం నా చేతనైంత నేను చేద్దామని వచ్చేశాను.

డాక్టర్‌గా నేనెంత బిజీగా ఉన్నా కుటుంబ జీవనానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తాను. సాయంత్రాలు అమ్మానాన్న, భార్య పిల్లలతో గడిపేందుకే ఇష్టపడతాను. సాయంత్రం సాధ్యమైనంత వరకూ కేసులు ఉండకుండా చూసుకుంటాను. పిల్లలతో ఈత కొట్టడం నాకు చాలా సరదా. ఇక కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తాను. మా రెండో అబ్బాయి కృష్ణకు ఇప్పటికీ నేనే స్నానం చేయిస్తా. బ్రిటన్‌లో ఉన్నప్పుడు ఇంటి పనులు చేయడంలో నేనే బెస్ట్. నిజానికి మాంసాహారం అంటే నాకు ఇష్టం. మా అమ్మమ్మ చేతి చారన్నం చాలా చాలా ఇష్టం. అప్పుడప్పుడూ సరదాగా సినిమాలు చూస్తుంటా. నా భార్య డాక్టర్ వైజయంతి. అమ్మానాన్నలు డాక్టర్ చలపతిరావు, ఉషాలక్ష్మిలు ఇస్తున్న ప్రోత్సాహం, చికిత్స కోసం వస్తున్న మహిళల ఆశీర్వాదాలు నాకు బలమైన టానిక్‌లా పనిచేస్తున్నాయి.

అమ్మ ప్రేమే...

# స్వదేశానికి రప్పించింది!!

ఈనాడు హైదరాబాద్
ఆదివారం 9 నవంబరు 2008 • 32 పేజీలు



**క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ పి.రఘురామ్**

న్యూస్‌టుడే-హైదరాబాద్

అమ్మానాన్న... ఇద్దరూ వైద్యులు. వారి ఏకైక సంతానం... రఘురామ్. చదువుల్లో మేటి. ఆయనా వైద్య విద్యను అభ్యసించారు. విదేశాల్లో స్థిరపడాలన్న లక్ష్యంతో బ్రిటన్‌లో వైద్య వృత్తి చేపట్టారు. ఐరోపాలోనే ప్రతిష్ఠాత్మక వైద్య కళాశాల 'రాయల్ మాస్టర్' ఆసుపత్రిలో విధి నిర్వహణ. సహధర్మచారిణి కూడా వైద్యురాలే. ఇద్దరు పిల్లలు... సాఫీగా సాగిపోతున్న జీవితం... మంచి డాక్టర్ అంటూ గుర్తింపు.... ఇంతలోనే ఓ షాకింగ్ న్యూస్. జన్మనిచ్చిన తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ అని తెలిసి తల్లడిల్లిపోయారు. తన తల్లిలాగా బాధపడే మరెంతో మంది మహిళలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ధనం, కీర్తిని తృణప్రాయంగా వదిలేసి నగరానికి వచ్చేశారు. కిమ్స్ ఆసుపత్రి సహకారంతో ఏడాది క్రితం సమగ్ర వైద్య కేంద్రాన్ని స్థాపించారు. ప్రేమ, అనుబంధం, ఆప్యాయత, దేశ సేవ... వీటికన్నా మించినవేవీ లేవన్నది ఆయన అభిప్రాయం. రొమ్ము కేన్సర్ వ్యాధిగ్రస్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వృత్తికీ, కుటుంబ జీవనానికి సమ ప్రాధాన్యం ఇస్తూ అనుకున్న లక్ష్యం వైపు అడుగులేస్తున్న ఆయన తన ఆలోచనలు, లక్ష్యాలు ఈ ఆదివారం తన అభిప్రాయాలను పాఠకులకు ఇలా వెల్లడిస్తున్నారు....

'మాది వైజాగ్. అమ్మానాన్నలిద్దరూ డాక్టర్లే. వారికి నేనొక్కడినే సంతానం. అల్లారు ముద్దుగా పెరిగాను. చిన్నప్పటి నుంచి చదువు పద్ధతి ప్రకారం పూర్తయ్యింది. 'హైదరాబాద్ పబ్లిక్ స్కూల్'లో హైస్కూలు చదువు. అక్కడ స్నేహితులు చాలా మంచివారు. ఇంటర్మీడియేట్ సెయింట్ అల్ఫోన్సాలో. ఎంబీబీఎస్ సీటు విజయవాడ సిద్ధార్థ కాలేజీలో వచ్చింది. నాలుగున్నరేళ్లు సరదాగా గడిచిపోయింది. తర్వాత ఎం.ఎస్.(జనరల్ సర్జరీ) కోసం మంగళూరుకు వెళ్లాను. సీరియస్‌గా చదువుకోవాలని అప్పుడు అన్పించింది. జనరల్ సర్జరీ చేస్తుండగానే విదేశాలకు వెళ్లి మరింత అనుభవాన్ని సాధించాలని అనుకున్నాను. ఎడింబర్గ్, గ్లాస్గో, ఐర్లాండ్‌లో ఎఫ్ఆర్‌సీఎస్ లభించింది. రొమ్ము కేన్సర్ శస్త్రచికిత్స సబ్ స్పెషాలిటీయన్‌గా కార్డిఫ్, నాటింగ్‌హాం, లీడ్స్‌లో ఐదేళ్లు పనిచేశాను. అప్పుడే రొమ్ము కేన్సర్ వ్యాధులపై పూర్తి దృష్టిని కేంద్రీకరించాను. వివిధ పరిశోధన పత్రాలను, అనుభవాలను క్రోడీకరించుకుని మరింత అనుభవాన్ని సాధించాను. నా సహధర్మచారిణి కూడా వైద్య నిపుణురాలు కావడం మరింత కలిసి వచ్చింది. ఆమె సంతాన సాఫల్య పద్ధతులపై పరిశోధన చేస్తున్నారు.

## వివేకానందుడే స్ఫూర్తి...

భారతదేశం, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రొమ్ము కేన్సర్ కేసులు ఎక్కువవుతున్నాయి. 40ఏళ్లు దాటిన వారు కేన్సర్ నిర్ధరణ పరీక్షలు చేయించుకోకపోవడంతో చాలామంది మహిళలు దీన్ని గుర్తించలేకపోతున్నారు. వీటన్నింటికీ పరిష్కారంగా రొమ్ము వ్యాధుల సమగ్ర చికిత్స కేంద్రాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పాలని నిర్ణయించుకున్నాను. నిజానికి నేను హైదరాబాద్‌కు వచ్చే ముందు జీరోని. ఇక్కడికి వచ్చాక మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలి. వివేకానందుడు చెప్పిన మాటలు నాకు బాగా గుర్తు. 'ఏదైనా ఒక లక్ష్యాన్ని ఎన్నుకోండి. అదే జీవిత లక్ష్యంగా మార్చుకోండి. దాని గురించే ఆలోచించండి. కలలు కనండి. దాన్నే ఆరాధించండి'(Take up one ideaMake that one idea your life- think of it, dream of it, love on it ) ఇదే నాకు స్ఫూర్తి. ఇక్కడికి వచ్చాక నా ఆలోచన విధానాన్ని మెచ్చుకున్న కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం తమ వద్ద ఈ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. అత్యాధునిక యంత్ర పరికరాలు తెప్పించారు. క్రితం సంవత్సరం అక్టోబర్‌లో 'కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్' కేంద్రాన్ని ప్రారంభించాం. ఏడాది వ్యవధిలో 1500 మందికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేశాం. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి నెల నుంచి జూన్ నెల వరకూ పరీక్షలు చేయించుకునే వారికి రాయితీలు ఇచ్చాం. సంవత్సరం గిర్రున తిరిగింది. నేను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలనన్న ధైర్యం వచ్చింది. దీంతో కిమ్స్-ఉషాలక్ష్మి చికిత్స కేంద్రాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దాలని అనుకుంటున్నాను.